మార్పు కోసం...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 190 29 శుక్రవారం, డిసెంబర్ 2023 పేజీలు: 4/వెల రూ5/-

విలేకరులు కావలెను

హైదరాబాద్, అమరావతి కేంద్రాలుగా నడుపబడుతున్న

మరో ఉదయం

(అక్రిడేషన్ కలిగి ఉన్న) తెలుగు దినపత్రికకు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు విలేకరులు కావలెను

మరిన్ని వివరాలకు సంపాదించండి

సెల్:9154842842

# తెలంగాణలో 35 శాతం ఓట్లు...

# 10 సీట్లు లక్ష్యం



**తెలంగాణ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న అమిత్ షా**


**దేశవ్యాప్తంగా 400 లోక్ సభ స్థానాల్లో గెలుపు సాధిస్తామని ధీమా**

**తెలంగాణలో కాంగ్రెస్ గెలవలేదని... బీఆర్ఎస్ ఓడిపోయిందని వ్యాఖ్య**

రానున్న లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి 35 శాతానికి పైగా ఓట్లు... 10కి పైగా సీట్లు రావాలని బీజేపీ అగ్రనేత అమిత్ షా అన్నారు. ప్రతి కార్యకర్త కూడా ఈ పార్టీ 'నాది' అనే ఆలోచనతో పని చేయాలని సూచించారు. హైదరాబాద్‌లో జరిగిన బీజేపీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రజలు కుటుంబ పాలన నుంచి విముక్తి పొంది.. మరో కుటుంబ పార్టీ చేతిలో పడ్డారని వ్యాఖ్యానించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించలేదని.. బీఆర్ఎస్‌ను ఓడించారన్నారు.అందుకే 35 శాతం ఓట్లు... 10 సీట్లలో గెలుపు లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త కష్టపడి పని చేస్తే దేశవ్యాప్తంగా బీజేపీ 400కు పైగా స్థానాల్లో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే సీటు మాత్రమే గెలిచిందని... ఇప్పుడు ఎనిమిది స్థానాల్లో విజయం సాధించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచి మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు.

# తమిళ నటుడు, డీఎండీకే అధినేత విజయకాంత్ కన్నుమూత

**చెన్నై: మరో ఉదయం**



తమిళ నటుడు, డీఎండీకే అధినేత కెప్టెన్ విజయకాంత్ (%ఎఅయిఖిఝిన్ఝిత్ష్ట్ర%) కన్నుమూశారు. శ్వాస సంబంధిత సమస్యతో చెన్నైలోని మియోట్ దవాఖానలో చేరారు. పరీక్షల్లో ఆయనకు కొవిడ్ నిర్ధారణ అయింది. ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించినప్పటికీ లాభం లేకుండా పోయింది. పరిస్థితి విషమించడంతో విజయకాంత్ తుదిశ్వాస విడిచారు. ఈ మేరకు తమిళనాడు ఆరోగ్య శాఖ కార్యదర్శి ప్రకటించారు. 71 ఏండ్ల విజయకాంత్ ఏడాది కాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. గత నెల 18న జలుబు, దగ్గు, గొంతునొప్పి వంటి సమస్యలతో చెన్నైలోని మియోట్ దవాఖానలో చేరారు. చికిత్స అనంతరం కోలుకుని డిసెంబర్ 11న ఇంటికి చేరుకున్నారు. అయితే అప్పుడే ఆయన మరణించారనే వార్తలు నెట్టింట షికారు చేశాయి. అయితే ఆ వదంతులను ఆయన సతీమణి ప్రేమలత కొట్టిపారేశారు. అయితే రెండు వారాలు గడువకముందే ఆయన కొవిడ్ బారినపడటం, మరోసారి శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తడంతో గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. తమిళ సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన విజయకాంత్.. ఆ తర్వాత ఆయన రాజకీయాల్లో సైతం అడుగుపెట్టారు. 2005లో డీఎండీకే పార్టీని స్థాపించారు.

# మనీలాండరింగ్ కేసు ఛార్జిషీటులో ప్రియాంక గాంధీ పేరు



**అమీన్‌పూర్ భూముల కొనుగోలు చేసిన రాబర్ట్ వాద్రా**

**కొన్నేళ్ల తర్వాత అమ్మిన వ్యక్తికే భూముల విక్రయం**

**ఈ లావాదేవీల్లో ఆర్థిక అవకతవకలు చోటుచేసుకున్నాయని ఈడీ ఆరోపణ**

**డిసెంబర్ 28 మరో ఉదయం**

ఎన్నారై వ్యాపారవేత్త సీపీ థంపి, బ్రిటన్ జాతీయుడు సుమిత్ చద్దాపై నమోదైన మనీలాండరింగ్ కేసులో భాగంగా దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ, ఆమె భర్త రాబర్ట్ వాద్రా పేర్లను ఈడీ చేర్చింది. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే..రాబర్ట్ వాద్రా 2006లో ఫరీదాబాద్‌లోని అమీన్‌పూర్‌లో రియల్ ఎస్టేట్ ఏజెంట్ హెచ్ఎల్ పహ్వా ద్వారా 40 ఎకరాల భూమిని కొనుగోలు చేసి 2010లో తిరిగి ఆయనకే దానిని విక్రయించారు. అలాగే, అదే ఏడాది అదే గ్రామంలో ఓ ఇంటిని కొనుగోలు చేసి 2010లో తిరిగి దానిని పహ్వాకే అమ్మేశారు. ఈ భూముల క్రయవిక్రయాలు ఆర్థిక అవకతవకలు చోటుచేసుకున్నాయని, అవసరమైన నిధులు థంపి, సుమిత్ చద్దా ద్వార వచ్చినట్టు ఈడీ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలోనే చార్జ్‌షీట్‌లో వారి పేర్లు చేర్చింది.

# మోదీ అనే ఔషధానికి గడువు తీరిపోయింది



**ఢిల్లీలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్న రేవంత్ రెడ్డి**

**జోడో యాత్ర కారణంగానే కర్ణాటకలో, తెలంగాణలో గెలిచామన్న తెలంగాణ సీఎం**

**భారత్ న్యాయ్ యాత్ర తర్వాత మోదీ ఇంజిన్ ఆగిపోతుందని జోస్యం**

దేశంలో మోదీ అనే ఔషధానికి గడువు తీరిపోయిందని తెలంగాణ ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావం సందర్భంగా గురువారం నాగపూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... రానున్న లోక్ సభ ఎన్నికల్లో ఢిల్లీలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర కారణంగానే కర్ణాటకలో, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. మహారాష్ట్రలోనూ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు.

రాహుల్ గాంధీ త్వరలో భారత్ న్యాయ్ యాత్ర చేయనున్నారని తెలిపారు. బీజేపీ నిత్యం డబుల్ ఇంజిన్ సర్కార్ అంటోందని... డబుల్ ఇంజిన్ అంటే అదానీ, ప్రధాని అని ఎద్దేవా చేశారు. లోక్ సభలో రాహుల్ గాంధీ గొంతెత్తడంతో అదానీ ఇంజిన్ ఆగిపోయిందని... ఇప్పుడు రాహుల్ భారత్ న్యాయ్ యాత్ర తర్వాత మోదీ ఇంజిన్ కూడా ఆగిపోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చి దేశాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా వంద రోజుల పాటు దేశం కోసం... కాంగ్రెస్ కోసం పని చేయాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణలో ఫిబ్రవరి 28వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు

**డిసెంబర్ 28 మరో ఉదయం**

**ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు ప్రాక్టికల్స్**

**ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు థీరీ పరీక్షలు**

**రెండు సెషన్లలో ప్రాక్టికల్స్ ఉంటాయన్న ఇంటర్ బోర్డు**

ఇంటర్ బోర్డు గురువారం ఇంటర్మీడియేట్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. తెలంగాణలో ఇంటర్మీడియేట్ పరీక్షలు ఫిబ్రవరి 28వ తేదీ నుంచి మార్చి 19వ తేదీ వరకు జరగనున్నాయి. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు... జనరల్ మరియు వొకేషనల్ కోర్సులు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. రెండో శనివారం, ఆదివారాల్లో ఈ పరీక్షలు జరుగుతాయని ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. రెండు సెషన్లలో ప్రాక్టికల్స్ జరుగుతాయని... ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు ఉంటాయని వెల్లడించారు. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష ఫిబ్రవరి 16వ తేదీన ఉంటుందని వెల్లడించారు.

# నా మిత్రుడు విజయకాంత్ లేరనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నా

**ఈ ఉదయం కన్నుమూసిన విజయకాంత్ తమిళ రాజకీయ రంగంపై చెరగని ముద్ర వేశారన్న మోదీ నటుడిగా కోట్లాది హృదయాలను**

**డిసెంబర్ 28 మరో ఉదయం**

ప్రముఖ సినీ నటుడు, డీఎండీకే అధినేత విజయకాంత్ మృతి పట్ల ప్రధాని మోదీ విచారం వ్యక్తం చేశారు. తమిళ చలనచిత్ర ప్రపంచంలో విజయకాంత్ ఒక లెజెండ్ అని చెప్పారు. తన విలక్షణమైన అభినయంతో కోట్లాది మంది హృదయాలను కొల్లగొట్టారని అన్నారు. ఒక రాజకీయ నాయకుడిగా ప్రజా సేవకు కట్టుబడి ఉన్నారని, తమిళనాడు రాజకీయ రంగంలో ఆయన చెరగని ముద్ర వేశారని కొనియాడారు. తనకు విజయకాంత్ సన్నిహిత మిత్రుడని, ఆయనతో తనకు ఉన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నానని చెప్పారు. ఈ విషాదకర సమయంలో ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు, అనుచరులకు సానుభూతిని తెలియజేస్తున్నానని అన్నారు. విజయకాంత్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు. ఆయన లేరనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని అన్నారు.



మార్పు కోసం...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## బిఆర్ఎస్ మోసాలను ఎండగట్టాల్సిందే !

తెలంగాణలో ప్రజాపాలన మొదలయ్యింది. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించడం మొదలయ్యింది. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు సంబంధించిన కార్యాచరణ మొదలయ్యింది. ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అంతే గాకుండా ప్రభుత్వాన్ని గడీల నుంచి..ప్రజల చెంతకు తీసుకుని వెళతామని చెప్పారు. అయితే అప్పులకుప్పను ఎలా అధిగమిస్తారన్నదే సమస్య. అప్పులు చేసిన వారిని ఊరికే వదిలితే ఎలా అన్నది కూడా ఆలోచించాలి. తెలంగాణను దోచుకున్న కల్వకుంట్ల కుటుంబాన్ని ఊరికే వదిలేస్తే దానికి అర్థం లేదు. ఆర్థికంగా దెబ్బతీసిన తీరు దారుణం కాక మరోటి కాదు. ప్రభుత్వం అంటూ ఒకటి ఉందన్న విషయం ఇప్పుడు ప్రజలకు అర్థం అవుతోంది. గత పదేళ్లుగా అసలు తెలంగాణ వచ్చిందా అన్న అనుమానం బుద్ధి జీవులకే ఉండేది. ఇక్కడో ప్రభుత్వం ఉందా అన్న విషయం కూడా తెలియదు. ఓ నిరంకుశ ప్రభుత్వంలో మగ్గడం వల్ల అసలు తెలంగాణలో ఉన్నామా లేదా అన్న అనుమానాలు ప్రతి ఒక్కరికీ ఉండేవి. నిజానికి తెలవంగాణ వచ్చిందన్న సోయి కూడా లేకుండా పోయింది. ఎందుకు తెలంగాణ తెచ్చుకున్నామా అన్న అనుమానాలు ,భయాలు కలిగాయి. కెసిఆర్ అధికార దర్పం కోసం, ఆయన, ఆయన కుటుంబ విలాసజీవితం కోసం మనమంతా పోరాడామా అన్న భయం కలుగుతోంది. ఈ అనుమానాలను పటాపంచలు చేస్తూ ..రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా అడుగులు వేస్తున్న తీరు అభినందనీయం. ఎందుకుంటే ఇందుకోసం మనం ఓ పదేళ్లు చీకట్లో మగ్గాల్సి వచ్చింది. సిఎం రేవంత్ రెడ్డి ఓ వైపు ప్రజలకు చేరువ అయ్యే ప్రయత్నం లో ఉంటూనే గత ప్రభుత్వం తాలూకు దుర్మార్గాలను వెల్లడిస్తున్న తీరును అంతా అభినందించాల్సిందే. గతంలోనే కెసిఆర్ ప్రభుత్వం కొత్త వాహనాలను ముందే కొనిపెట్టిన తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో 22 కొత్త కార్లు కొని దాచిపెట్టారని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కెసిఆర్ అధికార దర్పానికి ఇది మచ్చుతునక మాత్రమే. మూడోసారి అధికారంలోకి వస్తే వాటిని వాడుదా మనుకున్నారని చెప్పారు. కెసిఆర్ సంపద సృష్టి ఈ విధంగా ఉంటుందన్నారు. నిజంగానే ఇంతకాలం గోబెల్స్ ప్రచారం చేస్తూ ప్రజలను మభ్య పెడుతూ వచ్చారు. అప్పులకుప్పగా తెలంగాణను అగాథంలోకి నెట్టారు. నిరంతర కరెంట్ పేరుతో ప్రజలను మోసం చేసి కరిమింగిన వెలగపండులా అప్పులను చూపారు. గడీల మధ్య ప్రజలకు దూరంగా జరిగిన పాలనను గ్రామాలకు తీసుకువస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపాక ..ప్రజాపాలన మొదలయ్యాక మళ్లీ గ్రామాల్లో హడావిడి మొదలయ్యింది. సచివాలయంలో జ్నలిస్టులకు ప్రవేశం కల్పించడం పెద్ద విజయంగానే చూడాలి. దోచుకున్న సొమ్ము మొత్తం ప్రజలకు చేరేలా చేస్తామని ప్రకటించిన మేరకు చర్యలకు ఉపక్రమించాలి. అలాగే తాము ఇచ్చిన హామీ మేరకు ఏడాదిలోగా 2లక్షల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని, నిరుద్యోగులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన పనిలేదని చేసిన ప్రకటన కూడా నిఉద్యోగుల్లో భరోసా నింపేదిగా ఉంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతా యన్న భరోసా కలిగింది.గత ప్రభుత్వ అవినీతిపై శ్వేతపత్రాలు విడుదల చేశాక .6.71లక్షల కోట్లు అప్పులు చేసి నిండా ముంచారు. పరిస్థితుల నుంచి తేరుకుని ముందుకు వెళ్లేందుకు కృషి చేస్తున్నందున...ప్రజలు కూడా ప్రభుత్వాన్ని ముందుకు వెళ్లేందుకు అండగా నిలవాల్సి ఉంది. ఇప్పుడు ప్రభుత్వమే ప్రజలకోసం వారి వద్దకు వెళ్తున్నది. ఒకప్పుడు సచివాలయం అంటే ఏదో తెలియదు. మంత్రులు, అధికారులు అందుబాటులో ఉంటున్నారు. అన్నింటికి మించి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు, ఫలితాల తరువాత ప్రకటించిన మేరకు వివిధ అంశాల మీద శ్వేతపత్రాలను ప్రకటిస్తూ జనాలకు వాస్తవాలను

వెల్లడించడం ద్వారా ప్రజలకు వెల్లడించారు. వీటికి పోటీగా స్వేద పత్రాన్ని విడుదల చేసిన కెటిఆర్ అభాసు పాలయ్యారు. అప్పులు కాదు..ఆస్తులు సృష్టించామని చెప్పడం దారుణం కాక మరోటి కాదు. ఆస్తులు సృష్టిస్తే భూములు ఎందుకు అమ్మారన్నది చెప్పాలి. ఎందుకు వృధా ఖ్చులు చేశారో చెప్పాలి. ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా లోకానికి చూపించిన కాళేశ్వరం పథకానికి రుణ మంజూరు రూ. 97,449 కోట్లు కాగా విడుదల చేసింది రూ. 79,287 కోట్లు, దీని అప్పు ఇంకా రూ. 74,590 కోట్లు వుంది. ఈ రుణాలకు గాను చెల్లిస్తున్న అసలు, వడ్డీలు తడిసి మోపెడు అవుతున్నాయి. ఈ కారణంగానే ప్రతి నెలా ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటవ తేదీనే చెల్లించ లేని స్థితి. పిఆర్‌సి, కరువు భత్యం వాయిదాల పద్ధతిలో చెల్లిస్తుండగా, సకాలంలో మంజూరు చేయకుండా సంవత్స రాల తరబడి నిలిపివేస్తున్నారు. ఇవన్నీ దాచిపెట్టి బ్రహ్మాండంగా చేశామని చెప్పుకోవడం గత పాలకుల పైత్యానికి పరాకాష్టగా చూడాలి. శ్వేతపత్రాలపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో చేసిన ప్రకటనలపై ఎదురుదాడి చేసినా ఇప్పుడు నిజాలు దాగవు. ఆర్థిక పరిస్థితి ఇంతగా దిగజారలేదని ..చెప్పితే ప్రజలు నమ్మరు. అవన్నీ కూడా అధికారులు తయారు చేసి ఇచ్చినవే. గత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించి విద్యుత్ సంస్థలు, ఇతరులకు పెద్ద ఎత్తున బకాయి పెట్టింది. అప్పులు తెచ్చుకొనే అవకాశాలన్నింటినీ వాడుకొని కొత్తగా పుట్టకుండా చేసింది. వడ్డీ, అసలు వాయిదాలకే పరిమితంగా తీసుకొనే అప్పు సరిపోదు. రైతుబంధు పథకంలో పెద్ద రైతులకు మినహాయిస్తామని చెప్పినందున దాని వలన పెద్దగా మిగిలేదేమీ వుండదు. చేయాల్సిన అప్పులు చేసి..ఆస్తులు సృష్టించామంటే ఎవరు కూడా నమ్మరు. ఈ క్రమంలో ఫిబ్రవరిలోనే పా÷-లమెంట్ నోటిఫికేషన్ వస్తుందని చెబుతున్నారు. గనుక అప్పటి వరకు శ్వేత పత్రాలు, వాటి మీద చర్చ సాగుతుంటుంది. ప్రజల్లో కూడా ఆలచన వస్తుంది. కెసిఆర్ ప్రభుత్వం తన ఆడంబరం కోసం అప్పులు చేశారన్నది అక్షరసత్యం. కళ్లముందు కనిపిస్తున్న నిప్పులాంటి నిజం. విద్యుత్ సంస్థలకు బకాయిలు పెట్టినందుకు గత ప్రభుత్వాన్ని విమర్శించాల్సిందే. కాంగ్రెస్ అంత పెద్ద మొత్తాలను వెంటనే ఎలా తీరుస్తుందన్నది ప్రశ్న. ఉద్యోగులు వేతనాలు, పెన్షన్లు పెరిగేవే తప్ప తగ్గవు. వడ్డీల చెల్లింపు తప్పదు. ఇవన్నీ సరిదిద్దుకునేందుకు సమయం పట్టినా...తామంతా బ్రహ్మాండంగా చేశామన్న వారి బండారాన్ని బయటపెడితే తప్ప ..ప్రజలకు నిత్యం చేరవేస్తే తప్ప పాప పరిహారం జరగదు. మరోమారు ప్రజలు వారిని నమ్మి మోసపోకుండా చేయాల్సిందే.

## బొడ్డు కృష్ణయ్య కు కన్నీటి వీడ్కోలు పాడేను మోసిన వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**జూలూరుపాడు డిసెంబర్ 28 మరో ఉదయం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బేతాళ పాడు గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొడ్డు కృష్ణయ్య మృతికి ఈ ప్రాంత ప్రజలంతా గురువారం అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు. జూలూరుపాడు మండల నేటి రాజకీయ తరానికి మిత్రుడి గా ఉన్న అతని మరణం తీరనిలోటు అని పలువురు పేర్కొన్నారు. బుధవారం రాత్రి అకస్మాత్తుగా మరణించిన విషయాన్ని తెలుసుకున్న వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్, సులూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి , మాజీ శాసనసభ్యులు లావుడియా రాములు నాయక్ రాజకీయపక్షాల నేతలు వ్యాపారస్తులు స్నేహితులు శ్రద్ధాంజలి ఘటించారు. దహనసంస్కార కార్యక్రమంలో బొడ్డు కృష్ణయ్య పాడెను వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్ స్వయంగా పాడేమోసి తన ఆప్యాయతను చాటారు. దహన సంస్కార కార్యక్రమంలో దగ్గరుండి పాల్గొన్నారు. బుధవారం మండల ప్రజలంతా శోకసంద్రంలో మునిగిపోయారు.







## సింగరేణిలో ఎర్రజెండా రెపరెపలుసిపిఐ అనుబంధ ఏఐటియూసి విజయభేరి

**కొత్తగూడెం,డిసెంబర్ 28 మరో ఉదయం:**

సింగరేణి సంస్థ పై మరోమారు ఎర్రజెండా ఎగిరింది.సింగరేణి ఎన్నికల్లో సిపిఐ అనుబంధ ఎఐటియూసి విజయభేరి మోగించింది. హోరాహోరీగా సాగిన పోరులో స్పష్టమైన మెజారిటీతో 'నక్షత్రం' గుర్తు సత్తా చాటింది. సింగరేణిలో మరోసారి కార్మిక సంఘం గుర్తింపు యూనియన్ గా ఎఐటియూసి ఆవిర్భావించింది. డిసెంబర్ 27న జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో మెజారిటీ కార్మికులు ఎఐటియుసికి కి జై కొట్టారు. 1,999 ఓట్ల ఆధిక్యంతో సింగరేణిలో నాలుగోవసారి గుర్తింపు సంఘంగా ఎన్నికయింది. సింగరేణి సంస్థలో ఏడవ దఫాగా డిసెంబర్ 27న జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికలు ఉత్కంఠ భరితంగా కొనసాగాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కోల్ బెల్ట్ ప్రాంతంలో ఘోర పరాభవాన్ని చవిచూసిన బిఆర్ఎస్ ఈ ఎన్నికల్లో తమ అనుబంధ యూనియన్ ను పోటీకి దూరంగా ఉంచింది. దీంతో, ఊహించినట్లుగానే సింగరేణి ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంద ఐఎన్టియూసి మధ్యే ప్రధాన పోటీ కొనసాగింది. నువ్వా.. నేనా.. అనే రీతిలో కొనసాగిన ఈ పోటీలో సింగరేణి సంస్థ వ్యాప్తంగా గల 11 డివిజన్లకు గాను, 6 డివిజన్లలో ఎఐటియూసి విజయం సాధించగా, మిగిలిన 5 డివిజన్లను ఐఎన్‌టియుసి గెలుచుకుంది.అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన కాంగ్రెస్ సిపిఐ సింగరేణి ఎన్నికల్లో అనివార్యంగా ప్రత్యర్థులుగా తలపడ్డాయి. పరస్పర ఆరోపణలు, విమర్శలతో ప్రచారాన్ని హోరెత్తించాయి. భవిష్యత్తులో ఎలాంటి బంధం కొనసాగుతుందనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. కోల్ బెల్ట్ వ్యాప్తంగా గల ఐదు పార్లమెంట్ సెగ్మెంట్ల గెలుపు, ఓటమిలలో సింగరేణి కార్మికుల ప్రభావం కీలకంగా మారుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటుకోలేక, సింగరేణి ఎన్నికల్లో పత్తా లేకుండా పోయిన బిఆర్ఎస్ అనుబంధ సంస్థ, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పట్టు సాధించుకోవడం కష్టమేననే వాదన వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్-సిపిఐ పార్టీల మధ్య మళ్లీ సఖ్యత కొనసాగిస్తారా అన్నది ఆసక్తిగా మారింది.

## ఢిల్లీలో ప్రస్తుతం జేఎన్.1 కేసులు లేవు: మంత్రి

**న్యూఢిల్లీ,డిసెంబర్ 28 మరో ఉదయం:**

దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం ఎలాంటి జేఎన్.1 కేసులు లేవని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్ తాజాగా వెల్లడించారు. బుధవారం ఢిల్లీలో కరోనా కొత్త వేరియంట్ జేఎన్.1 తొలి కేసు వెలుగు చూసిన విషయం తెలిసిందే. మొత్తం ముగ్గురి శాంపుల్స్‌ను జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపించగా అందులో ఒకరికి ఒమిక్రాన్ సబ్ వేరియంట్ జేఎన్.1 సోకినట్లు బయటపడింది.అయితే, వైరస్ సోకిన వ్యక్తి గురువారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయినట్లు ఆరోగ్య మంత్రి తాజాగా వెల్లడించారు. ప్రస్తుతం అతడు పూర్తి ఆరోగ్యంతో ఉన్నాడని పేర్కొన్నారు. ఇప్పుడు ఢిల్లీలో జేఎన్.1 వేరియంట్ రోగులు లేరని స్పష్టం చేశారు. దేశంలో కరోనా సబ్ వేరియంట్ జెఎన్-1 చాపకింద నీరులా పాకుతున్నది. మంగళవారం ఒక్కరోజే 40 వేరియంట్ కేసులు బయటపడ్డాయి. మంగళవారం రాత్రి వరకు మొత్తం సుల సంఖ్య 109కి చేరింది. అందులో అత్యధికంగా గుజరాత్‌లో 36 కేసులు, కర్ణాటకలో 34, గోవాలో 14, మహారాష్ట్రలో 9, కేరళలో 6, రాజస్థాన్‌లో 4, తమిళనాడులో 4, తెలంగాణలో 2 కేసులు రికార్డయ్యాయి.

## తోటి పాత్రికేయ మిత్రులతో ఘనంగా రిపోర్టర్ ఆనంద్ కుమార్ జన్మదిన వేడుకలు

**కుత్బుల్లాపూర్ డిసెంబర్ 28 (మరో ఉదయం)**

నల్లగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం అవరణం లో ఉదయ అక్షరం తెలుగు దినపత్రిక జర్నలిస్టు గా విధులు నిర్వహిస్తున్న రాగాల ఆనంద్ కుమార్ జన్మదిన వేడుకలు పాత్రికేయుల ఆధ్వర్యంలో గురువారం రోజున ఘనంగా నిర్వహించారు. సహ పాత్రికేయులతో కలిసి ఆనంద్ కుమార్ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేసి స్వీట్లు పంచి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సహ పాత్రికేయులు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎక్కడా రాజీ పడకుండా వార్తల సేకరణలో నిర్విరామంగా కృషి చేస్తున్న మిత్రుడు ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో తన కుటుంబ సభ్యులతో నిండు నూరేళ్ళు సంతోషంగా జీవించాలని అన్నారు కాలక్రమేణా విధి నిర్వహణలో మరింత రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దరువు అంజన్న , రమేష్ కుమార్ ,గోపాల్ రెడ్డి , నామ మోహన్ , వెంకట్ , శ్రీశైలం బీ పవన్ రెడ్డి బీ సాయిరాజ్ బీ శ్రావణ్ , లక్ష్మణ్ , రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## 408 పరుగులకు దక్షిణాఫ్రికా ఆలౌట్

సెంచరియన్ లో జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియాపై ఆతిథ్య దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్ లో భారీ స్కోరు చేసింది. డీన్ ఎల్గార్ (185) సెంచరీ చేయగా.. మార్కో యన్సెన్ (84 నాటౌట్), డేవిడ్ బెడింగ్ హామ్ (56) అర్ధసెంచరీలతో దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్ లో 9 వికెట్లు కోల్పోయి 408 పరుగులు చేసింది. అయితే ఈ మ్యాచ్ లో కెప్టెన్ టెంబా బవుమా గాయం కారణంగా బ్యాటింగ్ చేయలేదు. తొలి ఇన్నింగ్స్ లో దక్షిణాఫ్రికాకు 163 పరుగుల ఆధిక్యం లభించింది. కాగా.. టీమిండియా బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా 4 వికెట్లు పడగొట్టాడు. మహ్మద్ సిరాజ్ 2, శార్దూల్ ఠాకూర్, ప్రసిద్ధ్ కృష్ణ , రవిచంద్రన్ అశ్విన్ తలో వికెట్ తీశారు. ఈ మ్యాచ్?లో టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా బౌలింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్?లో టీమిండియా 245 పరుగులకు ఆలౌట్ అయింది. ఆట ఇవాళ మూడో రోజు జరుగుతుంది. మరో రెండున్నర రోజుల ఆట మిగిలి ఉండటంతో మ్యాచ్ ఫలితంపై ఆసక్తి నెలకొంది. రెండో ఇన్నింగ్స్ లో టీమిండియా కూడా 400 పైచిలుకు స్కోరు సాధిస్తే, దక్షిణాఫ్రికా ముందు ఓ మోస్తరు లక్ష్యం ఉంచే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉంటే.. రెండో ఇన్నింగ్స్ ప్రారంభంలోనే భారత్ కు ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ రోహిత్ శర్మ ఏమీ పరుగులు చేయకుండానే కగిసో రబాడా బౌలింగ్ లో ఔటయ్యాడు. ప్రస్తుతం క్రీజులో యశస్వి జైస్వాల్ (5), శుభ్ మాన్ గిల్ (4) ఉన్నారు.

## రోహిత్ శర్మ అలా చేయాల్సింది కాదు!

సెంచూరియన్‌లోని సూపర్‌స్పోర్ట్ పార్క్‌లో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియా వెనుకబడింది. తొలి ఇన్నింగ్స్‌లో 245 పరుగులకు ఆలౌట్ అయిన భారత్.. దక్షిణాఫ్రికాను తక్కువ స్కోరుకే కట్టడి చేయడంలో విఫలమైంది. రెండో రోజు ఆట ముగిసేసరికి దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్‌లో 256/5 స్కోరు చేసింది. ఓపెనర్ డీన్ ఎల్గర్ (140 నాటౌట్) సెంచరీతో చెలరేగగా, డేవిడ్ బెడింగ్‌హామ్ (56) హాఫ్ సెంచరీ బాదాడు. భారత బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేదు. బౌలర్లను వినియోగించుకోవడంలో కెప్టెన్ రోహిత్ శర్మ వ్యూహం బెడిసి కొట్టిందని టీమిండియా మాజీ క్రికెటర్, కామెంటేటర్ రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. రవిశాస్త్రి మాట్లాడుతూ%ూ% 'రెండో రోజు లంచ్ బ్రేక్ సమయానికి దక్షిణాఫ్రికా 49/1 స్కోరుతో ఉంది. లంచ్ తర్వాత మ్యాచ్ ప్రారంభమైనప్పుడు ప్రసిధ్ కృష్ణ, శార్దూల్ ఠాకూర్‌తో రోహిత్ శర్మ బౌలింగ్ చేయించాడు. ఓపెనింగ్ స్పెల్ వేసిన జస్ప్రీత్ బుమ్రా, మొహ్మద్ సిరాజ్‌ను పక్కన పెట్టాడు. ఇదే వ్యూహాత్మక తప్పిదం. సెషన్‌ను టాప్ బౌలర్లతో ఆరంభించాలి. నేను కోచ్‌గా ఉన్నప్పుడు ఇదే చేశాం. రెండో సెషన్ ఆరంభంలో భారత్ చేసిన అతిపెద్ద పొరపాటు ఇదే. రోహిత్ అలా చేయాల్సింది కాదు' అని అన్నాడు. సంజయ్ మంజ్రేకర్ కూడా ఇదే అభిప్రాయాన్న వ్యక్తం చేశాడు. భారత జట్టు ఈ విషయంలో పొరపాటు చేసిందని.. కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ రోహిత్ శర్మ తప్పకుండా దీనిపై దృష్టిసారించాలన్నాడు. లంచ్ బ్రేక్ సమయంలో ఇద్దరూ మాట్లాడుకునే ప్రసిధ్, శార్దూల్‌తో బౌలింగ్ చేయించి ఉంటారని మంజ్రేకర్ పేర్కొన్నాడు. దీనిపై దక్షిణాఫ్రికా మాజీ పేసర్ వెర్నాన్ ఫిలాండర్ మాత్రం విభిన్నంగా స్పందించాడు. జస్ప్రీత్ బుమ్రాకు కాస్త విశ్రాంతినివ్వాలని రోహిత్, రాహుల్ భావించి ఉంటారన్నాడు.



మరో ఉదయం

# ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

## ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు పరీక్షలు

**హైదరాబాద్,డిసెంబర్ 28 మరో ఉదయం:**

ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు వెల్లడించింది. ఫిబ్రవరి 28 నుంచి ఇంటర్ ఫస్టియర్, ఫిబ్రవరి 29వ తేదీ నుంచి ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 17వ తేదీన ఎథిక్స్ ,హ్యూమన్ వాల్యూస్ ఎగ్జామినేషన్, ఫిబ్రవరి 19వ తేదీన ఎన్విరాన్‌మెంటల్ పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు సెకండ్ ఇయర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది తొలిసారిగా ఫస్టియర్ విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్స్‌ను కూడా నిర్వహించనున్నారు. ఈ ప్రాక్టికల్స్‌ను ఫిబ్రవరి 16వ తేదీన నిర్వహించనున్నారు. రెండో శనివారం, ఆదివారాల్లోనూ ప్రాక్టికల్స్ జరుగుతాయని అధికారులు వెల్లడించారు. ఫిబ్రవరి 16న ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష ఉంటుంది. ఫిబ్రవరి 28న సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1, మార్చి 1న ఇంగ్లీష్ పేపర్-1, 4న మ్యాథ్స్ పేపర్-1ం, బోటనీ పేపర్-1, పొలిటికల్ సైన్స్ పేపర్-1, మార్చి 6న మ్యాథ్స్ పేపర్-1ః, హిస్టరీ పేపర్-1, జువాలజీ పేపర్-1, మార్చి 11న ఫిజిక్స్ పేపర్-1, ఎకనామిక్స్ పేపర్-1, మార్చి 13న కెమిస్ట్రీ పేపర్-1, కామర్స్ పేపర్-1 ఉంటాయి.

# చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే

## క్రీడల్లో పోటీతత్వం అలవర్చుకోవాలి

## ఫుట్‌బాల్ పోటీల ప్రారంభంలో హరీష్ రావు

**సిద్దిపేట,డిసెంబర్ 28 మరో ఉదయం:**

చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. విద్యతోపాటు క్రీడల్లో పోటీతత్వం అలవర్చుకోవాలని సూచించారు. చదవుతోపాటు ఆటల్లో ప్రతిభ చూపించినవారికి మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. సిద్దిపేట ఫుట్‌బాల్ స్టేడియంలో ఇంటర్‌స్కూల్ డిస్టిక్ట్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని జాతీయ స్థాయి ఆటలకు సిద్దిపేట వేదికగా నిలిచిందన్నారు. ఆటలు అదుర్స్ అనేలా అన్ని వేదికలను పట్టణంలో ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని ఆటలకు నెలవుగా సిద్దిపేట మారిందని చెప్పారు. పాఠశాలల స్థాయికే పరిమితమైన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు పంపేల సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో 16 రకాల క్రీడలకు సంబంధించిన మైదానాలు, కోర్టులు, సౌకర్యాలను ఏర్పాటు చేశామని, దీంతో అనేక జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు అతిథ్యం ఇచ్చామన్నారు. స్విమ్మింగ్ ఫుల్ జాతీయ స్థాయిలో పోటీలకు, బ్యాడ్మింటన్, వాలిబాల్ రాష్ట్ర జాతీయ స్థాయి సెలెక్షన్స్, ఫుట్‌బాల్ సెలెక్షన్స్, రంగనాయక సాగర్ వద్ద జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు సిద్దిపేట వేదికయిందని చెప్పారు. సిద్దిపేట స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను మరో రూ.11 కోట్లతో అభివృద్ధి చేయబోతున్నామని, క్రికెట్ స్టేడియానికి రూ.4 కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, హాకీ, కరాటే, రన్నింగ్, హ్యాండ్ బాల్, షాట్‌పుట్, స్కెటింగ్, అ÷-లథెటిక్స్ తోపాటు ఇటీవలే నూతన వాలీబాల్ అకాడమి ఏర్పాటైందని చెప్పారు.











# ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు

# బాబు అన్యాయం

## వారి ఓట్లతో గెలిచి వారికి చేసిందేమీ లేదు

## డిప్యూటీ సీఎం అంజాద్ బాషా మండిపాటు



**అన్నమయ్య,డిసెంబర్ 28 మరో ఉదయం:**

గతంలో చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఓట్లతో గెలిచి వారికి అన్యాయం చేశారని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా మండిపడ్డారు. 14 ఏళ్లు సిఎంగా పనిచేసిన చంద్రబాబు టీడీపీ బీసీల పార్టీ అంటాడు.. బీసీల పేరు చెప్పుకుని మోసం చేశాడు. మన ఓట్లతో గెలిచి మనల్ని మోసం చేశారు. మోసం చేసిన చంద్రబాబు లాంటి వ్యక్తి కావాలా? సామాజిక న్యాయం చేసిన సీఎం జగన్ కావాలా? అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తోన్న మేలును వివరించడానికి వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతంగా సాగుతోంది. రాయచోటిలో గురువారం మధ్యాహ్నం సామాజిక సాధికార బస్సు యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ బస్సు యాత్రలో పలువురు మంత్రులతో పాటు ఇతర రాష్ట్ర స్థాయి నాయకులు హాజరయ్యారు. మధ్యాహ్నం రింగ్‌రోడ్డు నుంచి బంగ్లా వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రజలనుద్దేశించి ప్రజాప్రతినిధులు, నేతలు మాట్లాడారు. మైనార్టీని మంత్రి చేయని వ్యక్తి చంద్రబాబు. అదే సీఎం జగన్ నన్ను రెండుసార్లు ఎమ్మెల్యేను చేసి డిప్యూటీ సీఎంను చేశాడు. రాయచోటికి చెందిన జకియా ఖానమ్‌ను శాసన మండలి డిప్యూటి ఛైర్మన్‌ను చేశారు. చరిత్ర రాయాలంటే వైఎస్ కుటుంబానికే సాధ్యమౌవుతుంది. అందరిని నా వాళ్లు అని పిలిచే ఏకైక వ్యక్తి వైఎస్ జగన్. రాయచోటి ఈ ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చెందింది. రాయచోటి అభివృద్ధిలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కృషి ఎంతో ఉందని అంజాద్ బాష ప్రశంసించారు. రానున్న ఎన్నికల్లో నక్కలు, కుక్కలు, పందులు ఏకమవుతున్నాయి. అయినా భయపడేది లేదు .. సింహం వైఎస్ జగన్ సింగిల్‌గా వస్తారు. 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుస్తుంది. 175 స్థానాల్లో టీడీపీకి అభ్యర్థులు లేరు. మేము ఏరిపారేస్తే వారికి టికెట్లు ఇవ్వాలని చూస్తున్నారు‘ అని డిప్యూటీ సీఎం వ్యాఖ్యానించారు. వైఎస్సార్ ఫ్యామిలిని నమ్మి మోసపోయిన వారు ఎవరు లేరని ఎంపీ నందిగం సురేష్ అన్నారు. చంద్రబాబును నమ్మి మోసపోయిన వారు ఎంతో మంది ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ తేడా చూసి వైఎస్సార్‌సీపీని గెలిపించండి. సీఎం వైఎస్ జగన్ కోసం పోరాడే సైనికుడు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి. ఇప్పుడు మన పిల్లలు ఐక్యరాజ్యసమితిలో మాట్లాడుతున్నారంటే ఇది సీఎం జగన్ పాలన ఘనత. కార్యాలయాల చుట్టూ తిరగకుండా పథకాలు అందిస్తున్న వ్యక్తి జగన్‘ అని ఎంపీ సురేష్ పేర్కొన్నారు.

# మేనిఫెస్టోలపై చర్చకు సిద్ధమా?

## 99.5శాతం హామీలను అమలు చేసిన నేత సీఎం జగన్‌ది

## పొత్తుల పేరుతో అందరి కాళ్లు పట్టుకుంటున్న బాబు

## మేనిఫెస్టో ఫెయిల్ అంటూ అచ్చన్న వ్యాఖ్యలపై జోగి మండిపాటు

**అమరావతి,డిసెంబర్ 28 మరో ఉదయం:**

మీ మేనిఫెస్టో..మా మేనిఫెస్టోలపై చర్చిద్దామా అని టిడిపికి మంత్ఇ జోగి మేశ్ సవాల్ చేశారు. నూటికి నూరుపాళ్లు మేనిఫెస్టోను అమలు చేసిన ఘతన సిఎం జగన్‌దని అన్నారు. తెలుగుదేశం పార్టీకి తెగులు పట్టిందని మంత్రి జోగి రమేష్ విమర్శలు గుప్పించారు. టీడీపీ దివాళా తీసిందని అందరికీ తెలుసన్నారు. చంద్రబాబు ఒంటరిగా పోటీ చేసే దమ్ము, ధైర్యం లేదనీ తెలుసని ఎద్దేవా చేశారు. పొత్తుల పేరుతో అందరి కాళ్లు పట్టుకుంటూ చంద్రబాబు తిరుగు తున్నారని దుయ్యబట్టారు. అలాంటి పార్టీకి చెందిన అచ్చెన్నాయుడు వైస్సార్‌సీపీ మేనిఫెస్టో ఫెయిల్ అయిందని ఆరోపించటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. 99.5శాతం హామీలను అమలు చేసిన నేత సీఎం జగన్ మోహన్‌రెడ్డిదని చెప్పిన జోగి రమేష్.. దీనిని తాము నిరూపిస్తామని తెలిపారు. మేనిఫస్టోలపై చర్చకు వచ్చే దమ్ముందా? అని ప్రశ్నించారు. టీడీపీ 2014 నాటి మేనిఫెస్టో, వైఎస్సార్‌సీపీ 2019 నాటి మేనిఫెస్టో మీద చర్చకు రాగలరా?అని ప్రశ్నించారు. మేనిఫెస్టో అంటే తమకు బైబిల్, ఖురాన్, భగవద్గీతతో సమానమని తెలిపారు. మేనిఫెస్టో అమలు చేశాం కాబట్టే ధైర్యంగా ప్రతి ఇంటికీ వెళ్ళి మళ్ళీ ఓట్లు అడగగలుగుతున్నామన్నారు. చరిత్రలో ఎవరైనా ఎన్నికల తర్వాత ఇలా ఇంటికి వెళ్ళి అమలు చేసిన కార్యక్రమాల గురించి చెప్పారా? అని మంత్రి జోగి రమేష్ ప్రశ్నించారు. చంద్రబాబులాగా మేనిఫెస్టోని నెట్ నుంచి తొలగించలేదని దుయ్యబట్టారు. మేనిఫెస్టోని చించి శనక్కాయల పొట్లాలుగా మార్చలేదని మండిపడ్డారు. 2014లో మేనిఫెస్టోని అమలు



చేయలేదు కాబట్టే చంద్రబాబును జనం చిత్తుచిత్తుగా ఓడించారని గుర్తు చేశారు. ’అసలు చంద్రబాబుకు ఏపీతో ఏం పని?. ఈ రాష్ట్రంలో ఆధార్ కార్డు ఉందా?. ఇల్లు, డోర్ నెంబర్ ఉందా?. ఇలాంటి అడ్రస్ లేని వ్యక్తులు మా గురించి మాట్లాడటానికి సిగ్గుండాలి. రైతులు, డ్రాక్రా మహిళలకు రుణమాఫీ పేరుతో దారుణంగా మోసం చేశారు. నిరుద్యోగ భృతి పేరుతో యువతను మోసం చేశారు. అలాంటి మోసకారి, దుర్మార్గుడు అయినందునే చంద్రబాబుకు ఈ గతి పట్టింది. 30 లక్షల మందికి ఇళ్లు కట్టిస్తున్న జగన్ లాంటి సీఎం దేశంలో ఎక్కడైనా ఉన్నారా?. అసలు చంద్రబాబు చెప్పుకోవడానికి ఒక్క పథకమైనా ఉందా అని ప్రశ్నించారు. ’చంద్రబాబు దిక్కుమాలిన మేనిఫెస్టోని అసలు ఎవరైనా నమ్ముతారా?. చంద్రబాబు, పవన్ కల్యాణ్ మోకాళ్ల మీద నడిచినా ఆ పాపం పోదు. మళ్ళీ ఈరోజు మహిళలకు ఉచిత ప్రయాణమని అంటున్నారు. మేము ఎలాంటి ప్రకటనా చేయకపోయినా మాపై ఆరోపణలు చేస్తున్నారు. రామోజీ, రాధాకృష్ణ, చంద్రబాబు, పవన్, లోకేష్ ఉండేది, తినేది హైదరాబాదులో. అక్కడ కూర్చుని ఏపీలో రాజకీయాలు చేయటం ఏంటి?. ఈ ఎన్నికల తర్వాత వారు ఈవైపు ఇక కన్నెత్తి కూడా చూడరని జోగి రమేష్ విమర్శించారు.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## జెండా ఎగరేసిన టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు

**సుజాతనగర్ డిసెంబర్ 28 ( మరో ఉదయం)**

భద్రాద్రి జిల్లా సుజాతనగర్ మండల కేంద్రలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు చింతలపూడి రాజశేఖర్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ అవతరించిందని, ఆనాటి నుంచి దేశ సమగ్రతను కాంగ్రెస్ కాపాడుతూ వచ్చిందన్నారు. ఉక్కు మహిళ ఇందిరాగాంధీ పరిపాలనలో సమూల మార్పులు తీసుకొచ్చారని, దేశ సమగ్రతను కాపాడటంలో విదేశీ శక్తులకు వ్యతిరేకంగా ఇందిరాగాంధీ కొట్లాడారని కొనియాడారు. దేశ ప్రజల కోసం, దేశ అభ్యున్నతికి రాజీవ్ గాంధీఎంతో కృషి చేశారన్నారు. ప్రపంచ దేశాల ముందు శక్తివంతమైన దేశంగా భారత్‌ను నిలబెట్టారన్నారు. సమాచార హక్కు చట్టాన్ని తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని, ఆనాడు మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశ పెట్టింది కూడ కాంగ్రెస్ అన్న విషయాన్ని గుర్తుచేశారు. దేశానికి పొంచి ఉన్న ముప్పు నుంచి కాపాడేందుకే రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్ర ప్రజల్లో విశేష స్పందన లభించిందన్నారు. దేశ సరిహద్దుల్లో ఆక్రమణలు జరుగుతున్నా ప్రశ్నించలేని దౌర్భాగ్య స్థితిలో ప్రధాని మోదీ ఉన్నారని, పార్లమెంట్ లో బీజేపీ ఎంపి ద్వారా పాసులు పొందిన దుండగుల విధ్వంసంపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేని స్థితిలో బీజేపీ ప్రభుత్వం ఉండటం ఉండటం దురదృష్టమన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చేతిలో తెలంగాణ దివాళా తీసిందని అప్పులు చేసి గొప్పలు ప్రచారం చేసుకున్నారన్నారు. తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పును స్ఫూర్తిగా తీసుకుని రాబోయే రోజుల్లో దేశ ప్రజలు కూడ కాంగ్రెస్ కు పట్టం కట్టడం ఖాయమని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా కన్వీనర్ బాలు భద్రరావు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బాదావత్ మాన్సింగ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాన్యా, అమృ వీరన్న, సుజాతనగర్ గ్రామ పంచాయితి వార్డు మెంబర్ గద్దం లక్ష్మణరావు, యువజన కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్కే అబీద్, యువజన కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీ తేజావత్ శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ నాయకులు మెట్టేల సైదుబాబు, శ్రీకాంత్, రాచబంటి నాగరాజు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సినిమా వార్తలు

## ఈగిల్ నుంచి ఎండో పాట విడుదల

టాలీవుడ్ హీరో రవితేజ  కాంపౌండ్ నుంచి వస్తున్న తాజా చిత్రం ఈగల్ కార్తీక్ ఘట్టమనేని డైరెక్ట్ చేస్తున్నాడు. అనుపమ పరమేశ్వరన్ , కావ్య థాపర్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని  జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా ఏదో ఒక అప్‌డేట్ అందిస్తున్నారు టీం మెంబర్స్. ఈగల్ నుంచి సెకండ్ సింగిల్ అప్‌డేట్ అందించారు. తాజాగా మేకర్స్ ఈగల్ నుంచి గల్లంతే గల్లంతే అంటూ సాగే రెండో పాటను మేకర్స్ లాంఛ్ చేశారు. రవితేజ, కావ్యథాపర్ మధ్య వచ్చే ఈ సాంగ్ ఫీల్ గుడ్ మెలోడీ ట్రాక్‌తో మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేసేలా సాగుతుంది. ఇప్పటికే లాంఛ్ చేసిన ంజీటబీఓజీఇఅజీ లిరికల్ వీడియో సాంగ్ ఊరమాస్ స్టెప్పులతో సాగుతూ అభిమానులు, మూవీ లవర్స్‌ను ఫుల్ ఎంటర్‌టైన్ చేస్తోంది.

ఈగల్‌లో నవదీప్, శ్రీనివాస్ అవసరాల, మధుబాల కీలక పాత్రలు పోషిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన ఈగల్ పోస్టర్లు, స్టైలిష్ లుక్, ట్రైలర్ అప్‌డేట్ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ.. సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. విషం మింగుతాను.. విశ్వం తిరుగుతాను.. ఊపిరి ఊదుతాను.. కాపలా అవుతాను.. విధ్వంసం నేను.. విధ్వంసాన్ని ఆపే వినాశనం నేను.. అంటూ ట్రైలర్‌లో మాస్ మహారాజా రవితేజ స్టైల్‌లో సాగుతున్న మార్క్ డైలాగ్స్ అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు.




## సరిపోదా శనివారంలో కొత్త లుక్‌లో నాని

హీరో నాని, దర్శకుడు వివేక్ ఆత్రేయ రెండో సారి కలసి పని చేస్తున్న 'సరిపోదా శనివారం' చిత్రం తాజా షెడ్యూల్ బుధవారం మొదలైంది. ఈ చిత్రంలో నాని పూర్తి స్థాయి యాక్షన్ పాత్ర పోషిస్తున్నారు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'గత నెలలో ఒక షెడ్యూల్ పూర్తి చేశాం. బుధవారం నుంచి కొత్త షెడ్యూల్ ప్రారంభించాం. లెంగ్తీ షెడ్యూల్ ఇది. యాక్షన్ ఎపిసోడ్స్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొనగా కొంత టాకీ పార్ట్ కూడా చిత్రీకరిస్తాం. ఈ సినిమాలో నాని రగ్గడ్ లుక్‌లో కనిపించి, అందరినీ అలరిస్తారు' అని నిర్మాతలు చెప్పారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఎస్.జె.సూర్య కీలక పాత్ర పోషిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతాన్ని సమకూరుస్తుండగా, మురళీ జి సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.



## విజయకాంత్ మృతితో కోలీవుడ్‌లో విషాదం

### మార్నింగ్ షోలు రద్దు చేసిన థియేటర్లు

తమిళ నటుడు, డీఎండీకే అధినేత కెప్టెన్ విజయకాంత్ మృతితో కోలీవుడ్‌లో విషాదం అలముకుంది. శ్వాస సంబంధిత సమస్యతో చెన్నైలోని మియోట్ దవాఖానలో చేరగా.. కొవిడ్ నిర్ధారణ అయింది. ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తుండగా.. విజయకాంత్ తుదిశ్వాస విడిచారు. నటుడిగా, రాజకీయవేత్తగా ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్న విజయ్ కాంత్ మృతి పట్ల యావత్ తమిళ ప్రజలతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు.విజయకాంత్ మృతికి సంతాపంగా తమిళనాడు వ్యాప్తంగా థియేటర్లలో మార్నింగ్ షోలను రద్దు చేశారు. కెప్టెన్ విజయకాంత్ సార్ మనల్ని విడిచి వెళ్లిన నేపథ్యంలో సంతాపంగా మార్నింగ్ షో రద్దు చేశామని, రెగ్యులర్ షోలను మధ్యాహ్నం 2:30 గంటల నుంచి షురూ చేస్తామని థియేటర్ల యాజమాన్యాలు ప్రకటించాయి. 71 ఏండ్ల విజయకాంత్ ఏడాది కాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. నవంబర్ 18న జలుబు, దగ్గు, గొంతునొప్పి వంటి సమస్యలతో చెన్నైలోని మియోట్ దవాఖానలో చేరారు. చికిత్స అనంతరం కోలుకుని డిసెంబర్ 11న ఇంటికి చేరుకున్నారు. అయితే రెండు వారాలు గడువకముందే ఆయన కొవిడ్ బారినపడటం, మరోసారి శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తగా పరిస్థితి విషమించడంతో ఉదయం తుదిశ్వాస విడిచారు. తమిళ సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన విజయకాంత్.. ఆ తర్వాత ఆయన రాజకీయాల్లో సైతం అడుగుపెట్టారు. 2005లో డీఎండీకే పార్టీని స్థాపించారు.

## చిరంజీవే నా స్ఫూర్తిప్రదాత నటుడు విక్టరీ వెంకటేశ్

కలియుగ పాండవులు సినిమాతో దగ్గుబాటి ఫ్యామిలీ నుంచి హీరోగా సిల్వర్ స్క్రీన్‌పై మెరిశాడు వెంకటేశ్ . కామెడీ, ఫ్యామిలీ, యాక్షన్.. ఇలా అన్ని ఎలిమెంట్స్‌తో కూడిన సినిమాలతో వినోదాన్ని అందించడం వెంకీ స్పెషాలిటీ. తన యాక్టింగ్‌తో కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్న వెంకటేశ్ ప్రస్తుతం వెంకీ 75 సినిమాతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. తాజాగా వెంకీ మామ సినిమాటిక్ జర్నీ సెలబ్రేషన్ ఈవెంట్ నిర్వహించారు. ఈవెంట్‌కు మెగాస్టార్ చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరయ్యాడు. ఈ సందర్భంగా వెంకీ మాట్లాడిన మాటలు అందరిలో జోష్ నింపాయి. చిరంజీవి ఇక్కడ లేకుంటే నేను సినిమాల నుంచి తప్పుకొని ఇప్పటికే హిమాలయాలకు వెళ్లేవాడినంటూ చెప్పుకొచ్చాడు వెంకటేశ్. చిరంజీవి సుమార్ 9 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఖైదీ నం 150 సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టడం చూసి.. నా అభిమానులకు వినోదాన్ని పంచడం కొనసాగించాలని ఫిక్స్ అయ్యా. అప్పుడే ఖచ్చితంగా యాక్టింగ్ కొనసాగించాలని అనుకున్నా. యాక్టింగ్ ఇక ఆపను అంటూ వెంకీ మామ నుంచి ఆసక్తికర కామెంట్స్ వచ్చేసరికి ఆడిటోరియం అంతా అరుపులు, విజిల్స్, ప్రశంసలతో హోరెత్తిపోయింది. వెంకటేశ్ కాంపౌండ్ నుంచి యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తోన్న సైంధవ్  చిత్రానికి హిట్ ఫేం శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నాడు. సైంధవ్ జనవరి 13న సంక్రాంతి కానుకగా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషనల్ ఈవెంట్స్‌తో బిజీగా ఉంది వెంకీ టీం. చందప్రస్థ ఫిక్షనల్ పోర్ట్ ఏరియా బ్యాక్‌డ్రాప్ మిషన్ నేపథ్యంలో సాగుతున్న ఈ చిత్రంలో జెర్సీ ఫేం శ్రద్దా శ్రీనాథ్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. బాలీవుడ్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా కీలక పాత్రలు పోషిస్తున్నారు. నవాజుద్దీన్ సిద్దిఖీ ఈ మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ఇప్పటికే సైంధవ్ రోల్స్ ఇంట్రడక్షన్ వీడియో నెట్టింట హల్ చల్ చేస్తోంది.

సైంధవ్‌లో శ్రద్దా శ్రీనాథ్ మనోజ్ఞగా, రుహానీ శర్మ డాక్టర్‌గా, నవాజుద్దీన్ సిద్దిఖీ వికాస్ మాలిక్ పాత్రలో, కోలీవుడ్ యాక్టర్ ఆర్య మానస్ పాత్రలో కనిపించనున్నారు. సైంధవ్ గ్లింప్స్ వీడియో ఇప్పటికే సినిమాపై అంచనాలు పెంచుతోంది. సైంధవ్ మూవీని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి తెరకెక్కిస్తుండగా.. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నాడు.






## వైసిపిపైనా సినిమా తీస్తా నట్టికుమార్ ప్రకటన

రామ్‌గోపాల్ వర్మ ఒక డైరెక్టర్ అని.. వైసీపీ వాళ్లు డబ్బులిస్తే వ్యూహం సినిమా తీశాడని సినీ నిర్మాత కమ్ డైరెక్టర్ నట్టి కుమార్ పేర్కొన్నారు. డబ్బులిచ్చారు కాబట్టి వైసీపీపై వర్మకు సానుభూతి ఉంటుందన్నారు. కానీ సినిమాలు చూసి ప్రజలు ఓట్లు వేసే రోజులు పోయాయన్నారు. వ్యూహం సినిమా తాను చూస్తానని.. వెంటనే వైసీపీకి వ్యతిరేకంగా సినిమా తీస్తానని నట్టి కుమార్ తెలిపారు. ఎంపీ రఘురామ కృష్ణరాజుకు చిత్ర హింసలు, వివేకానందరెడ్డి మర్డర్ ఎలా జరిగింది? వైసీపీ అరాచకాలపై నేను సినిమాలు తీసి సమాధానం చెబుతా. వివేకానంద మర్డర్ ఎందుకు చేశారో చెప్పలేని పరిస్థితుల్లో ఏపీ ప్రభుత్వం ఎందుకు ఉంది. సినీ పరిశ్రమ మొత్తం టీడీపీ వైపు ఉంది. ప్రస్తుతం సినీ రంగం భయంతో ఉంది. త్వరలో టీడీపీకి మద్దతుగా అందరూ వస్తారు. రాష్ట్ర ప్రజల బాగు కోసం నేను టీడీపీకి సపోర్ట్ చేస్తున్నా. చంద్రబాబుని త్వరలో కలిసి నా ప్రత్యక్ష రాజకీయాలపై కార్యచరణ ప్రకటిస్తా. విశాఖలో సినీ రంగానికి ప్రభుత్వ స్టూడియో నిర్మాణం కావాలని లోకేష్ గారిని అడిగాను. సినిమా హబ్ గా విశాఖను తీసుకువస్తాం. టీడీపీ, జనసేనకి 130 నుంచి 150 సీట్లు వస్తాయి. వైసీపీ 29 సీట్లకు పరిమితమవుతుంది. కాపులపైన, రంగా పైన ప్రేమ ఉంటే నాలుగున్నరేళ్లలో అమర్నాథ్, పేర్ని నాని, అంబటి ఎందుకు విచారణ చేపట్టలేదని..ముద్రగడ పద్మనాభం ఎందుకు మాట్లాడలేదని నట్టి కుమార్ ప్రశ్నించారు.

## విజయ్‌కాంత్ మృతికి టాలీవుడ్ దిగ్భ్రాంతి

### చిరు,పవన్ కళ్యాణ్, మోమన్‌బాబుల సంతాపం



డీఎండీకే అధ్యక్షుడు, సినీ నటుడు విజయకాంత్ మరణం వార్తతో కోలీవుడ్‌తోపాటు సౌత్  సినిమా ఇండస్ట్రీ తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. సినీలోకం కెప్టెన్ అని పిలుచుకునే మనిషి దూరమయ్యాడంటూ కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ మేరకు పలు సినీ సెలబ్రిటీలు విజయకాంత్ కు సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు.  'మన 'పురట్చి కలైంగర్', 'కెప్టెన్' విజయకాంత్ ఇకలేరని తెలిసి గుండె బద్దలైనట్టయింది. ఆయన గొప్ప వ్యక్తి. మాస్ హీరో. మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి. తెలివైన రాజకీయ నాయకుడు. డైరెక్ట్‌గా తెలుగు చిత్రాల్లో నటించనప్పటికీ ఇక్కడ కూడా ఎంతోమంది సినీ ప్రేమికుల ప్రేమను పొందారు. ఇప్పుడు తిరిగిరాని లోకాలకు వెళ్లి శూన్యాన్ని మిగిల్చారు. ఆయన అభిమానులకు, కుటుంబ సభ్యులకు నా సానుభూతి తెలుపుతున్నా. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నా' అని చిరంజీవి ట్వీట్ చేశారు.  విజయకాంత్ గారు కన్నుమూశారని తెలిసి చింతిస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. కుటుంబ కథాంశాలతోపాటు సామాజిక, అంశాల మేళవింపుతో యాక్షన్  చిత్రాలు ఎక్కువ చేశారు. ఆపదలో ఉన్న వారిపట్ల మానవతా దృక్పథంతో స్పందించేవారు. ఆయనకు తొలి అడుగులో ఎదురైన ఫలితానికి అధైర్యపడక  రాజకీయాల్లో నిలబడ్డారు. ఆయనకు సినీ సహచరుల నుంచి అవమానాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. ఆ తత్వంతోనే తమిళనాడు అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ప్రజల పక్షం వహించారు. విజయకాంత్ గారిని చివరిసారి 2014లో పార్లమెంట్ సెంట్రల్ హాల్లో కలిశాను. తమిళనాడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాదగ్గ నాయకుడు అని ఎందరో భావించారు.

ఆరోగ్యం క్రమంగా క్షీణించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయన రాజకీయ వారసత్వాన్ని ఆయన సతీమణి శ్రీమతి ప్రేమలత గారు కొనసాగిస్తారని ఆశిస్తున్నానని  పవన్  కల్యాణ్ నివాళి అర్పించారు. 'నా మిత్రుడు, దిగ్గజ నటుడు విజయకాంత్ మృతి చెందడం బాధాకరం.  చెన్నైలో ఉన్నప్పుడు ఆయనతో లెక్కలేనన్ని క్షణాలు గడిపాను. ఎంతో స్నేహంగా ఉండేవాళ్లం. ఆయనతో బంధం నా జీవితంలో ఓ ముఖ్యమైన భాగం. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని నటుడు, నిర్మాత డాక్టర్ మోహన్‌బాబు తెలిపారు. విజయకాంత్ గారి మరణం విచారకరం. ఆయన జ్ఞాపకాలతో ఆయన కుటుంబసభ్యులు సాంత్వన పొందాలని , భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నట్లు నటుడు రవితేజ తెలిపారు. నా మొదటి సినిమానే విజయకాంత్‌తో కలిసి నటించే అవకాశం రావడం నా అదృష్టం. ఎన్నో సలహాలిచ్చారు. ఆయనకు ఎప్పటికీ రుణపడి  ఉంటానని నటుడు సోనుసూద్ తెలిపారు.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com